క్లుప్తంగా

గుర్రప్పతండాలో వైద్యశిబిరం



మరిపెడ రూరల్: మరిపెడ మండలం గుర్రప్ప తండా గ్రామ పంచాయతీ పరిధిలో మహబూబాబాద్‌కు చెందిన శ్రీ కరుణ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ నవీన్‌కుమార్ డీఎస్‌బీ జనరల్ మెడిసిన్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. వ్యక్తి గత పరిశుభ్రత, ఆహార నియమాలు పాటిస్తేనే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బషీర్, ప్రశాంత్ రెడ్డి, రాకేశ్, వెంకటేశ్, విజయ్, వరణ్, భరత్, అశ్విని నీలిమ పాల్గొన్నారు.

కాల్వకు మరమ్మతు



నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం మీక్యతండా శివారు మగ్య తండా పరిధిలో తెగిపోయిన కాల్వకు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. కాలువ తెగిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. టెండర్లు పిలిస్తే ఆలస్యం అవుతుందని టెండర్ లేకుండా తన సొంత నిధులతో ఎమ్మెల్యే మరమ్మతు పనులు చేపట్టినట్లు రైతులు తెలిపారు. నెల్లికుదురు మండలం రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



దంతాలపల్లి: మండలం రేపోణి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పది రోజుల నుంచి నిర్వహిస్తున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ మూడుజిల్లాల స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో ఖమ్మం పట్టణం జట్టు ప్రథమ బహుమతి, రేపోణి జట్టు ద్వితీయ బహుమతి, బడితండా జట్టు తృతీయ బహుమతులు సాధించాయి.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

దంతాలపల్లి: ప్రభుత్వం ఆదేశాలనుసారం నిర్వహిస్తున్న సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దారు రాజేశ్వర్, ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆదివారం ఏఓ వాహినితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్వహించే సర్వే ఆధారంగానే రైతులకు భరోసా పథకం వర్తిస్తుందని, తప్పులు లేకుండా సర్వే నిర్వహించి అర్హులకు ప్రభుత్వ పథకాలందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ అప్సర్‌పాషా, ఆయా గ్రామాల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామసభలు

మహబూబాబాద్ రూరల్ : రైతు భరోసా, ఇందిరమ్మ రైతు ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై మహబూబాబాద్ మండలంలోని గ్రామాల్లో ఈ నెల 21, 22, 23, 24 తేదీల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు. ఆయా గ్రామాల్లోని జీపీ కార్యాలయాల వద్ద అధికారులు గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజల సమక్షంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. కొన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటలకు మరికొన్ని గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటలకు గ్రామ సభలు నిర్వహించే విధంగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. మొదటి రోజైన మంగళవారం మండలంలోని రెడ్యాల, సండ్రాలగూడెం, ఆమనగల్, బలరాంతండా, వేమునూరు, ఇందిరా నగర్ కాలనీ, మల్యాల, చోక్ల తండా, పర్వతగిరి, సోమ్లు తండా గ్రామాల్లో గ్రామ సభలు జరుగనున్నాయి.

గడ్డివాము దగ్ధం

కొత్తగూడ: ప్రమాదవశాత్తు గడ్డి వాము దగ్ధమైన సంఘటన మండలంలోని జంగవానిగూడెంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఈక అశోక్ పశువుల మేత కోసం వరిగడ్డిని పశువుల కొట్టం(గుడిసె) పక్కన నిల్వ చేశాడు. ప్రమాదవశాత్తు గడ్డికి నిప్పు అంటుకుంది. గ్రామస్తులు మంటలను అదుపుచేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పశువుల కొట్టం కాలిపోవడంతోపాటు అందులో ఉన్న లేగ దూడ సజీవ దహనం అయింది. అగ్ని మాపక యంత్రం వచ్చి మంటలార్పటంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఈఘటనలో సుమారు రూ.30వేల ఆస్తి నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు అశోక్ కోరాడు.

దారి ధ్వంసం..

- ముల్కలపల్లి రోడ్డు గుంతలమయం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

డోర్నకల్: ఉయ్యాలవాడ క్రాస్ రోడ్డు నుంచి ముల్కలపల్లి వరకు కొంతకాలం క్రితం నిర్మించిన బీటీ రోడ్డు అనేక చోట్ల ధ్వంసమైంది. రోడ్డుపై పెద్దగుంతలు ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఉయ్యాలవాడ క్రాస్ రోడ్డు నుంచి ఉయ్యాలాడ, వెన్నారం, తొడేళ్లగూడెం మీదుగా ముల్కలపల్లి వరకు 13.22 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను రూ.8.3 కోట్ల ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన నిధులతో పూర్తి చేశారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయిన కొద్ది నెలలకే సుమారు 20 ప్రాంతాల్లో రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. భారీ వాహనాల రాకపోకలతోపాటు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో రోడ్డుపై పగుళ్లు ఏర్పడి కంకరు తేలి గుంతలు ఏర్పడ్డాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్న అంశంపై గతంలో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన కాంట్రాక్టర్ రోడ్డు ధ్వంసమైన ప్రాంతాల్లో మరమ్మతులు చేశారు. కొద్ది రోజుల తర్వాత మరమ్మతులు చేసిన ప్రాంతాలతోపాటు మరికొన్ని పదేశాల్లో కంకర కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో మూలమలుపుల వద్ద రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలకు శాశ్వత మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



వెన్నారం- ఉయ్యాలవాడ మార్గంలో రోడ్డుపై ఏర్పడిన గుంత

పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం

- మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం పారిశుద్ధ్య కార్మికులకు నూనె, సబ్బులు, యూనిఫాంలు, టవల్స్ గ్లౌజులు ఇతరత్రా చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నెని వెంకన్నతోకలిసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవలు మరువలేనివన్నారు. చెత్తను రోడ్లపై వేయకుండా వాహనాలు రాగానే వాటిలో వేసి కార్మికులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నోముల రవీందర్, ఫ్లోర్‌లీడర్లు అజయ్‌సారథిరెడ్డి, చిట్యాల జనార్దన్, కౌన్సిలర్లు హరిసింగ్, బుజ్జి వెంకన్న, పోతురాజు రాజు, నాయకులు గంగాధర్, ఖలీల్, మేనేజర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.



కార్మికులకు యూనిఫాంలు, సబ్బులు అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల పాట్లు

డోర్నకల్: డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో ఒకటో ప్లాట్ ఫారానికి రావాల్సిన రైళ్లు తరచూ రెండు, మూడో నంబర్ ప్లాట్‌ఫారాలకు వస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం సికింద్రాబాద్‌కు వెళ్లే శాతవాహన ఎక్స్‌ప్రెస్ కోసం ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై పెద్ద సంఖ్యలో ప్రయాణికులు వేచి ఉన్నారు. ఇదే సమయంలో ఒకటి, రెండో నంబర్ ప్లాట్‌ఫారాలపై గూడ్స్ రైళ్లు నిలిచి ఉన్నాయి. రైలు రావడానికి ఐదు నిమిషాల ముందు మూడో నంబర్ ప్లాట్‌ఫారానికి రైలు వస్తుందంటూ అనౌన్స్ చేయడంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీదుగా మూడో నంబర్ ప్లాట్‌ఫారానికి ప్రయాణికులు పరుగులు తీశారు. పండుగ సెలవులు ముగిసిన తర్వాత స్వగ్రామాలకు వెళ్తున్న ప్రయాణికులు లగేజీతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్లాట్‌ఫారంపై గూడ్స్ రైళ్లు నిలిపి ఉంచొద్దని ప్రయాణికులు కోరుతున్నారు.



మొదటి ప్లాట్‌ఫారంపై నిలిపిఉంచిన గూడ్స్ రైలు

పూర్వ విద్యార్థుల కలయిక ఆనందదాయకం



చిన్నగూడూరు: నాటి గురువులతో పూర్వ విద్యార్థులు



గార్ల:సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1987–88 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 37 వసంతాల ఈ వేడుకలో తమకు పాఠాలు చెప్పిన గురువులు చంద్రమౌళి, యాదగిరి, సారంగపాణిలను సత్కరించారు. అనంతరం సాంస్కృతిక సారథి కొమురె వెంకన్న బృందం పాడిన పాటలు, మిమిక్రీ, ఆటపాటలు అలరించాయి. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దొంగరి నర్సయ్య, జంపాల చక్రధర్, గాడిపెల్లి శ్రీహరి, పొన్నం రమేష్, దేశగాని రమేష్, ధర్మసోత్ వెంకన్న, శ్రీలత, కృష్ణవేణి, శ్రీదేవి, వరలక్ష్మి, జబర్దస్త్ రాజమౌళి, బండ వెంకన్న, భరత్, మహిళా కళాకారులు పాల్గొన్నారు.

28ఏళ్ల స్నేహం

గార్ల: గార్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు 28 ఏళ్ల తర్వాత ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఆత్మీయంగా, ఆప్యాయంగా ఒకరినొకరు పలుకరించుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం నాటి గురువులు జ్యోతి, శారద, రామన్న లను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కట్టా రమేష్, వధూద్, కొండల్‌రెడ్డి, వెంకటప్రసాద్, హేమవతి, అరుణకుమారి, శైలజ, అనిత, భారతి, హరిబాబు, ఉపేందర్, రవి, షబ్బీర్, నరసింహారావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

తొర్రూరు: రహదారి భద్రత అందరి బాధ్యత అని ఎస్సై ఉపేందర్ తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రతపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఎస్సై మాట్లాడుతూ అతివేగం, నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్‌కుమార్, ప్రతినిధులు రేగూరి వెంకన్న, వెంకటేశ్వర్లు, దామెర సరేష్, శంకర్, రమేష్, శ్రీనివాస్, కుమార్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్సై ఉపేందర్

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న చందా గోపి

కేసముద్రం: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి చందా గోపి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ సంఘం 22వ మండల వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నూరు కాపులకు జనాభా ప్రాతిపాదికన ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని ఆయన అన్నారు. అనంతరం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బోర్డు సభ్యుడిగా నియామకమైన రావుల మురళి, బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలం శ్రీనివాస్, జిల్లా ముఖ్యసలహాదారుడు న్యాయవాది తుంపిళ్ల శ్రీనివాస్, వద్దిరాజు దేవేందర్, కముటం శ్రీనివాస్, ఆకుల సుధాకర్, ప్రవీణ్‌కుమార్, యాదగిరి, కొమ్మన్న, శివకుమార్, శ్రీను, సుందర్ వెంకన్న, శోభన్ పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో గిరిజన విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మూడేళ్లుగా బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులు రాకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు గిరిజన విద్యార్థులను ఫీజులు చెల్లించాలని ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులు రాక గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం స్పదించి నిధులు విడుదల చేయాలని కోరుతున్నమన్నారు. జాతీయ బంజార మిషన్ ఉపాధ్యక్షుడు ప్రసాద్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ యువజన అధ్యక్షుడు రమేశ్‌నాయక్, నాయకులు బాలు, శివ, హరి పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు నియంత్రించాలి

నెల్లికుదురుసెంటర్: ప్రజలకు భారంగా మారుతున్న నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గునిగంటి రాజన్న అన్నారు. చేపూరి గణేష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెరిగిన నిత్యవసరాల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, వెలిశాల సుధాకర్, సురేశ్, నరసింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గునిగంటి రాజన్న

పంచాయతీ కార్యదర్శిని నిలదీసిన ప్రజలు

నర్సింహులపేట: మండలంలోని వంతడపల గ్రామంలో రేషన్ కార్డులు అందరికీ రాలేదని ఆదివారం పంచాయతీ కార్యదర్శి వెంకన్నను గ్రామస్తులు నిలదీశారు. గ్రామంలో 300 పైగా దరఖాస్తు చేసుకోగా, 50 మందికి మాత్రమే వచ్చాయని, మళ్లీ ఎప్పుడు వస్తాయని గొడవ చేశారు. అర్హులందరికీ కార్డులు వస్తాయని, ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని పంచాయతీ కార్యదర్శి ప్రజలకు నచ్చజెప్పారు.

కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి

నెల్లికుదురుసెంటర్: శ్రామికవర్గ వ్యతిరేక విధానాలపై కార్మికులు, కర్షకులు పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సీఐటీయూ, రైతు సంఘం, వ్యకాస ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సదస్సు ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుంట ఉపేందర్, శెట్టి వెంకన్న, అల్వాల వీరయ్య మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులను, మద్దతు ధర చట్టం చేయకుండా రైతులను, ఉపాధి పనులను కల్పించకుండా ఉపాధి కూలీలను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తుందని అన్నారు. ఆకుల రాజు, గునిగంటి రాజన్న, కుర్ర మహేష్, కుమ్మరికుంట్ల నాగన్న, పోతుగంటి మల్లయ్య, జల్లె జయరాజ్, తోట శ్రీనివాస్, మార్తినేని పాపారావు, నల్లపు సుధాకర్, బొబ్బల యాకుబ్, వెంకటేశ్వర్లు, రాజన్న, వీరభద్రం, గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శెట్టి వెంకన్న

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మహబూబాబాద్ రూరల్ / నెల్లికుదురుసెంటర్ : శనిగపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మహబూబాబాద్ మున్సిపాలిటీ, మండలంలోని గ్రామాలు, తండా జీపీల పరిధిలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంటు సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనిగపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నేడు(సోమవారం) మరమ్మతులు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని శనిగపురం, అయోధ్య, వెంక్యతండా, ముడుపుగల్, పాత తండా, బోడ తండా, రెడ్యా తండా, గుండ్లబోడు తండా, బట్టు తండా, వీరారం తండా, చెరువుకొమ్ము తండా, ముత్యాలమ్మ తండా, మార్గదర్శి బీఈడీ కళాశాల, బాలాజీ గార్డెన్, ప్రమోద్ హోమ్స్, కుమ్మరికుంట తండా, మల్యాల, చేపూరిగూడెం, పెద్ద రామోజీ తండా, చిన్న రామోజీ తండా, దామ్య తండా, భోగంబోడు తండా, ఆరేళ్ల రామచంద్రు తండా, కంబాలబండ తండా, సాదు తండా, చోక్ల తండా, సోమ్లా తండా ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావున ఆయా సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం..

బియ్యం అందజేత

మహబూబాబాద్ రూరల్ : మహబూబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు బాబునాయక్ తండాలో గుగులోత్ చందు అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి క్వింటా బియ్యం ఆదివారం అందజేశారు. మృతుడి కుమారుడు గుగులోత్ పవన్, బీఆర్‌ఎస్ నాయకులు లూనావత్ అశోక్, బానోత్ శంకర్ మేస్త్రి, రామరాజు యాకన్న, భూక్యా సక్కు, రాము, ప్రసాద్, ప్రవీణ్, రాజేష్, రాంకుమార్, అజ్మీర్ వినోద్, పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో సామగ్రి దగ్ధం

నర్సింహులపేట: మండలంలోని ముంగిమడుగు గ్రామంలో డప్పుకాటి వాసుదేవ ఇంట్లో ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో సామగ్రి దగ్ధమైంది. తాళం వేసిన వాసుదేవ ఇంట్లో ఒక్కసారిగా మంటలు రావడంతో గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మంటలను అదుపుచేశారు. మంటలు త్వరగా అదుపుచేయడంతో పెను ప్రమాదం తప్పింది. టీవీ, ఫ్యాన్‌తోపాటు ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. ఎస్సై మాలోతు సురేశ్ సందర్శించి పరిశీలించారు.

మద్దతు ధర చెల్లింపు చట్టం చేయాలి

కేసముద్రం: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా మద్దతు ధరల చెల్లింపు చట్టాన్ని చేయాలని ఏఐసీటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రిపెల్లి మొగిలి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. కేంద్రం అమలు చేయబోతున్న ధర లోటు చెల్లింపు పథకం వల్ల రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాటోతు బిచ్యానాయక్, హరికృష్ణ, రామచంద్రు, కుమారస్వామి, ఐలయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ

తొర్రూరు: తొర్రూరు నూతన సీఐగా నియమితులైన గణేష్ ఆదివారం పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకు ఇంటెలిజెన్స్, మట్టెవాడ, ఆత్మకూరు సీఐగా పని చేయగా అనంతరం డిప్యూటేషన్‌పై ట్రాన్స్‌కోలో విధులు నిర్వహించారు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ చేపట్టాలి

బయ్యారం/నెల్లికుదురుసెంటర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీ ప్రాంతంలోని ఖనిజసంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం విప్లవకారులపై ఉక్కుపాదం మోపుతుందని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదకరస్థితిలోకి వెళ్లిందని పేర్కొన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లను కేంద్ర ప్రభుత్వం ఆపివేయాలని డిమాండ్ చేశారు.

కమిటీ ఎన్నిక

నెల్లికుదురుసెంటర్: కార్పెంటర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా ఆవుల సీతయ్య, ప్రధాన కార్యదర్శిగా దొంతు నరేష్, కోశాధికారిగా మహ్మద్ ఖాజా గెలుపొందారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

మరసం అడ్‌హక్ కమిటీ

మహబూబాబాద్ అర్బన్: జిల్లాకు పలువురు రచయితలు ఆదివారం జిల్లా కేంద్రంలోని సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మరసం(మానుకోట రచయితల సంఘం) అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా చింతకుంట్ల కుమార్‌స్వామి, కోకన్వీనర్‌గా డాక్టర్ మద్దెర్ల రమేష్, సభ్యులుగా వేముల రవీందర్, పింగిళి శ్రీనివాస్‌రావు, సామ సత్యం నియామకయ్యారు.

జాతీయ నాటకోత్సవాలు

తొర్రూరు: తొర్రూరు పట్టణంలో చైతన్య కళా సమాఖ్య ఆధ్వర్యంలో మార్చి 10 నుంచి జాతీయ నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు సమాఖ్య అధ్యక్షుడు మన్నూరు ఉమ, కార్యదర్శి సుంకరనేని పినాకపాణి ఆదివారం తెలిపారు.

క్రైం న్యూస్

లారీ కారు ఢీ–ఒకరికి గాయాలు



రోడ్డు పక్క గుంతలో పడిన కారు

కురవి: లారీ, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటన కురవి మండల కేంద్రం శివారు 365/ఏ ఖమ్మం జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. ఈ ఘటనలో కారులో ఉన్న వ్యక్తికి స్వల్పంగా గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. సూర్యాపేటకు చెందిన లారీలో డ్రైవర్ ధరావత్ రవి సిమెంట్ లోడు చేసుకుని మహబూబాబాద్‌కు వచ్చి రైల్వే పనుల వద్ద సిమెంట్ అన్‌లోడ్ చేసుకుని సీరోలు మండలం కాంపల్లికి కురవి మీదుగా వెళ్తున్నాడు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన అజిత్‌సింగ్ తన కుటుంబసభ్యులతో మండలంలోని నల్లెల్ల శివారు సూర తండాలోని బంధువుల ఇంటికి వచ్చాడు. అజిత్‌సింగ్ చెల్లె మహబూబాబాద్‌లోని రైల్వే స్టేషన్ వద్ద ఉండగా తీసుకెళ్లేందుకు సూర తండా నుంచి మానుకోటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కురవి శివారులోని మూలమలుపు వద్ద లారీ, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారు ఎగిరి రోడ్డు పక్కన గుంతలో పడిపోయింది. కారులో ఉన్న గుగులోత్ జతిన్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. అతన్ని మానుకోటలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. లారీ స్టీరింగ్ రాడ్ పగలడంతో ఆయిల్ లీక్ అయి కదలకుండా ఉంది. విషయం తెలుసుకున్న కురవి ఏఎస్సై సదయ్య, కానిస్టేబుల్ గణపతి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ–ముగ్గురికి తీవ్రగాయాలు



అంబులెన్స్‌లో క్షతగాత్రులు

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో 365 జాతీయ రహదారిపై రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఆదివారం జరిగిన ఈఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యా నాయక్ తండా జీపీ పరిధిలోని బోడ తండాకు చెందిన బోడ సుమతి, శ్రీను బైక్‌పై తండా నుంచి కొత్తూరు(సీ) మీదుగా కందికొండ స్టేజీ నుంచి 365 జాతీయ రహదారిపై మహబూబాబాద్‌కు వెళ్తున్నారు. ఇదే క్రమంలో చిన్నగూడూరు మండలం మంగోరిగూడేనికి చెందిన వినయ్ అనే వ్యక్తి బైక్‌పై కందికొండ స్టేజీ వద్దకు వచ్చాడు. అక్కడి నుంచి కురవి వైపు స్పీడ్‌గా వచ్చి.. అయ్యగారిపల్లి గ్రామంలో ముందు వెళ్తున్న బైక్‌పై ఉన్న సుమతి, శ్రీను ఢీకొట్టడంతో కిందపడ్డారు. వినయ్ సైతం కిందపడిపోగా తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. వినయ్ పరిస్థితి విషమంగా ఉందని 108 సిబ్బంది తెలిపారు. సుమతి, శ్రీనులకు గాయాలు కావడంతో జనరల్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స తీసుకుని అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లినట్లు తెలిసింది.

కళారత్న అవార్డు ప్రదానం



అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

కేసముద్రం: కరీంనగర్‌లో ఆర్యాణి సకల కళావేదిక, గౌతమేశ్వర సాహితి కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో మండలంలోని ఇంటికన్నె గ్రామానికి చెందిన ప్రముఖ చిందుయక్షగాన కళాకారుడు మేడిపెల్లి భాస్కర్ కళారత్న స్వర్ణ కంకణ జాతీయస్థాయి సంక్రాంతి పురస్కార అవార్డును అందుకున్నారు. 35 ఏళ్లుగా ఎన్నో ప్రదర్శనలు చేసిన భాస్కర్, పలువురి ప్రశంసలు పొందినట్లు ప్రకటనలో తెలిపారు.